సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 19 । ఆగస్టు । 2025



సోలార్ ప్లేట్ల ఏర్పాటుకు..

ప్రభుత్వ ఆఫీస్‌లు, స్కూళ్ల భవనాలపై సోలార్ ప్లేట్ల ఏర్పాటుకు నివేదికలు అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.

- 8లో ▸



సాకు చూపి.. మాట మార్చి

ప్రభుత్వం బోనస్ ఇవ్వలేదనే సాకు చూపుతూ సీడ్ కంపెనీలు అదనంగా చెల్లిస్తామన్న సొమ్ము విషయంలో మాట తప్పుతున్నాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.3 /21.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సర్వాయి పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి



సుభాష్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్త లు పిలుపునిచ్చారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వినాయక్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో వక్తలు మాట్లాడారు. రాచరిక వ్యవస్థ కొనసాగుతున్న ఆ రోజుల్లో కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న ఓ సాధారణ వ్యక్తి వృత్తిపై పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం చేయడం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు. అదనపు కలెక్టర్ అంకిత్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల నాయకులు నరాల సుధాకర్, రాజ నరేందర్ గౌడ్, ఆదె ప్రవీణ్, మారయ్య గౌడ్, జయసింహాగౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, గౌడ సంఘాల ప్రతినిధులు, గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి



రెంజల్(బోధన్): గోదావరి, మంజీర పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సీపీ సాయి చైతన్య సూచించారు. మండలంలోని కందకుర్తి పుష్కరక్షేత్రంతో పాటు అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి సోమవారం గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. రానున్న రెండు, మూడు రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతవరణ శాఖ అధికారులు ప్రకటించారని గుర్తుచేశారు. నదుల వైపు వెళ్లకుండా గ్రామాల్లో దండోరా వేయించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 87126 59700 నంబర్లకు కాల్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయన వెంట ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్‌బాబు, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సిద్ది రామేశ్వర్ ఉన్నారు.


ఈ నెల 20నుంచి డిచ్‌పల్లి రైల్వే గేటు మూసివేత

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో మండల కేంద్రం నుంచి ఘన్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి, దూస్‌గాం, ముల్లంగి(ఐ), గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గేటు (నెంబర్ 196టీ)ను నాలుగు రోజులపాటు మూసివేయనున్నట్లు రైల్వే శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న అర్ధరాత్రి 12 గంటల నుంచి 24వ తేదీ రాత్రి 11 గంటల వరకు గేటు మూసి వేసి ఉంటుందని పేర్కొన్నారు. వాహనదారులు డిచ్‌పల్లి స్టేషన్, నాగ్‌పూర్ గేట్, 44వ నంబర్ జాతీయ రహదారిపై 7వ బెటాలియన్ లక్ష్మీవేంకటేశ్వర ఆలయం మీదుగా ఘన్‌పూర్ గ్రామానికి చేరుకోవాలని సూచించారు. అలాగే ఘన్‌పూర్ నుంచి బొమ్మల గుండు హనుమాన్ మందిరం, 44వ నంబర్ జాతీయ రహదారి, పోలీస్ స్టేషన్ మీదుగా డిచ్‌పల్లి స్టేషన్‌కు చేరుకోవాలని పేర్కొన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు రెండు ఏటీసీలు

ఆర్మూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణనిచ్చేందుకు రెండు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్మూర్ మండల కేంద్రంతోపాటు బాన్సువాడ పరిధిలోని వర్నిలో రూ.45 కోట్ల వ్యయంతో కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పరిపాలన అనుమతులతో కూడిన ఉత్తర్వులు విడుదలయ్యాయి. కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల విభాగంతోపా టు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలలో 46 ఏటీసీల ఏర్పాటుకు ఉత్తర్వులు అయ్యాయి. అందులో భా గంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు రెండు కేంద్రాలు మంజూరు కావడంపై యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ప్రత్యేక చొరవతో ఈ ఏటీసీల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడంపై ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిండు కుండలా మారిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు



నిజాంసాగర్ గేట్ల ద్వారా మంజీరలోకి విడుదలవుతున్న నీరు





ఎస్సారెస్పీ నుంచి విడుదలవుతున్న నీరు

ఉప్పొంగిన నదులు



సాలూర శివారులో పాత వంతెన మీదుగా ప్రవహిస్తున్న మంజీర

జలాశయాలకు వరద పోటెత్తింది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు అనూహ్యంగా ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం అర్ధరాత్రి నిజాంసాగర్ ప్రాజెక్టుకు 62వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో 90 వేల క్యూసెక్కులకు చేరింది. 1.30 గంటల ప్రాంతంలో గేట్లను ఎత్తివేశారు. మరోవైపు ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో లక్షా 52వేలకు పెరగడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. సోమవారం 39 వరద గేట్లను ఎత్తారు. రాత్రి వేళ ఒక గేటును మూసివేశారు. 38 గేట్ల ద్వారా లక్షా 32వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వెళ్తోంది.

శ్రీరాంసాగర్, నిజాంసాగర్ గేట్ల ఎత్తివేత

- ప్రాజెక్టులకు పోటెత్తిన వరద
- ఆదివారం అర్ధరాత్రి నిజాంసాగర్..
- సోమవారం ఉదయం ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద ఉధృతి కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్ ఎస్‌ఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈ చక్రపాణి వరద గేట్ల ద్వారా నీటి విడుదలను సోమవారం ప్రారంభించారు. ఆదివారం ఉదయం నుంచి లక్షా 52 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, రాత్రికి 10 గంటల సమయానికి లక్షా 43 వేలకు పడిపోయింది. అర్ధరాత్రి తరువాత లక్షా 52 వేలకు పెరగడంతో ప్రాజెక్ట్ నిండుకుండల మారింది. నీటి నిల్వ 73 టీఎంసీలు దాటగానే గేట్లను ఎత్తారు. ముందుగా 9 వరద గేట్లను క్రమంగా ఎత్తి 25 వేల క్యూసెక్కులు వదిలారు. ఆ తరువాత 16, మధ్యాహ్నం ఒంటి గంటకు మొత్తం 24 గేట్లను ఎత్తి నీటి విడుదలను 75 వేల క్యూసెక్కులకు పెంచారు. 2 గంటల సమయానికి 34 వరద గేట్లను ఎత్తి లక్షా 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సాయంత్రం 4 గంటలకు మొత్తం 39 వరద గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. రాత్రి 8గంటల సమయంలో ఒక గేటును మూసివేశారు. 38 గేట్ల ద్వారా లక్షా 32వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. ఎస్‌ఈ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర ద నీటి ఆధారంగా గోదావరిలోకి నీటి విడుదలను చేపడుతామన్నారు. పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఈ జగదీశ్, ఏఈఈ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి విడుదల

వరద కాలువకు నీటి విడుదల పెరిగింది. ఆదివారం 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు.. సోమవారం ఉదయం 15 వేలకు ఆ తరువాత 18 వేల క్యూసెక్కులకు పెంచారు. కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 636 క్యూసెక్కుల నీరు పోతోంది.

36 మెగావాట్ల విద్యుదుత్పత్తి..

కాకతీయ కాలువకు 5 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండటంతో నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ఒక్కో టర్బయిన్ ద్వారా 9 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతుంది.

తగ్గిన వరద..

ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. లక్షా 52 వేలు కొనసాగిన వరద సోమవారం రాత్రి సమయానికి లక్షా 17 వేల 148 క్యూసెక్కులకు పడిపోయింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం రాత్రి 1088.90(72.99 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

పక్షం రోజుల ముందే..

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పక్షం రోజుల ముందే ఎస్సారెస్పీ గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభమైంది. గతేడాది సెప్టెంబర్ 2వ తేదీన గేట్లను ఎత్తారు. 2018 నుంచి ప్రతి ఏడాది ప్రాజెక్ట్‌కు భారీ ఇన్‌ఫ్లో వస్తుండడంతో గేట్లను ఎత్తుతున్నారు. 2018, 2022, 2023 సంవత్సరంతోపాటు ఈ ఏడాది ఆగస్టులోనే గోదావరిలోకి నీటిని విడుదల చేశారు.

నిజాంసాగర్ 13 గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్(జుక్కల్): వరద పోటెత్తడంతో ఆదివారం అర్ధరాత్రి నిజాంసాగర్ 13 గేట్లను ఎత్తారు. సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతోపాటు హల్దీవాగు, ఘనపురం ఆనకట్ట, పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతుండటంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. వరద తాకిడితో నిజాం సాగర్ ప్రాజెక్టు ప్రమాదకర స్థాయికి చేరుకోగా అధికారులు అప్రమత్తమయ్యారు. అర్ధరాత్రి ఒంటి గంట న్నర కు నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తివేశారు. 13 గేట్ల ద్వారా 85 వేల క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1403. 50 అడుగుల (15.667 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

36 ఏళ్ల తర్వాత..

- నేడు నిజాంసాగర్ 20 గేట్లకు ట్రయల్‌రన్

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో ముప్పై ఆరేళ్ల తర్వాత నిజాంసాగర్ ప్రాజెక్టు చివరన ఉన్న 20 గేట్లను తెరవనున్నారు. మంగళవారం ఈ గేట్లను ఎత్తి ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ప్రాజెక్టుకు మూడు చోట్ల కలిపి 48 గేట్లున్నాయి. నిజాంసాగర్‌కు ఒకవైపు 12, మధ్యలో16, ఇంకోవైపు 20 గేట్లున్నాయి. సాధారణంగా మధ్యలో ఉన్న 16 గేట్లను, అవసరానుగుణంగా ఒకవైపు ఉన్న 12 గేట్లను ఎత్తుతుంటారు. 20 గేట్లను భారీ ఇన్‌ఫ్లో వచ్చినప్పుడు మాత్రమే ఎత్తుతారు. 1988 సంవత్సరంలో నిజాంసాగర్ ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కులు, 1989 సంవత్సరంలో 4 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ సమయంలో ఈ 20 గేట్లను ఎత్తి నీటిని మంజీర నదిలోకి విడుదల చేశారు. ప్రస్తుతం భారీ వరద వస్తుండడంతో డ్యాం సేఫ్టీ దృష్ట్యా ఈ 20 గేట్లను ఎత్తాలని నిర్ణయించారు. ఒక్కో గేటును 5 ఫీట్ల మేర లేపి, నీటిని దిగువకు వదులుతూ ట్రయల్ రన్ నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ తెలిపారు. నిపుణుల బృందం గేట్ల పనితీరును పరిశీలిస్తుందన్నారు. నీటి విడుదల నేపథ్యంలో నది పరీవాహక ప్రాంతంలో బోర్లు, పైపులైన్లు, కరెంట్ వైర్లు కలిగి ఉన్న రైతులు వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

గంటగంటకు పెరిగిన వరద

బోధన్/రెంజల్: మంజీర, గోదావరి నదులు ఉప్పొంగుతున్నాయి. సోమవారం సాయంత్రం 4 గంటలకు సాలూర శివారులోని పాత వంతెన పైనుంచి మంజీర ప్రవహించింది. వరద ఉధృతి సోమవారం రాత్రి వేళ మరింత పెరిగే అవకాశం ఉంది. పాత వంతెన మీదుగా రాకపోకలు సాగించకుండా నది అవతలి వైపు మహారాష్ట్ర అధికారులు మట్టివేసి రోడ్డును మూసివేశారు. సాలూర తహసీల్దార్ శశిభూషణ్ మంజీరను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. మహారాష్ట్రతోపాటు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద పోటెత్తడంతో కందకుర్తి వద్ద గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకుని ప్రవహిస్తోంది. గంటగంటకూ వరద పెరుగుతోందని అధికారులు పేర్కొన్నారు.



అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరి

అలీసాగర్ రిజర్వాయర్ గేట్ల ఎత్తివేత

బోధన్: ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో ఉన్న అలీసాగర్ రిజర్వాయర్ కు భారీ వరద రావడంతో రెండు గేట్లను ఎత్తా రు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామ ర్థ్యం 1299.6 ఫీట్లుకాగా సోమవారం ఉదయం వరకు 1298.6 ఫీట్ల మేర నీరు చేరింది. దీంతో రెండు వరద గేట్లు ఎత్తి 1000 క్యూసెక్‌ల నీటిని దిగువ ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు డి–50 కాలువలోకి వదిలారు. నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు రిజర్వాయర్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఉదయం నుంచి వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది.



వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

32.2 మి.మీ. వర్షపాతం

- చెరువులు, వాగులకు జలకళ

సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా సోమవారం 32.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రుద్రూర్ మండలంలో 162.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. గత ఐదారు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభమై మూడు నెలలు పూర్తి కావొస్తున్నా.. కేవలం డొంకేశ్వర్, ఇందల్వాయి, కోటగిరిల్లో మాత్రమే అత్యధిక వర్షం కురిసింది. 20 మండలాల్లో సాధారణ, 10 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజులపాటు జిల్లాకు వర్షసూచన ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అధిక వర్షపాతం నమోదైన మండలాలు ఇవే..

మండలం	వర్షపాతం (మి.మీ.)	మండలం	వర్షపాతం (మి.మీ.)
రుద్రూర్	162.4	బోధన్	73.9
కోటగిరి	144.4	చందూర్	55.6
వర్ని	113.5	ఎడపల్లి	53.5
పొతంగల్	102.3	మోస్రా	53.0
		రెంజల్	45.2

రెండు పంటలకూ భరోసా

- నిండుకుండలా ఎస్సారెస్పీ
- ఆయకట్టు రైతుల హర్షం



బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయం ఆయకట్టు రైతుల్లో భరోసా నింపింది. మొన్నటి వరకు ఖరీఫ్ పంటలకు మాత్రమే నీరందుతుందని అనుకున్న రైతులకు మూడు రోజుల వ్యవధిలో వచ్చిన వరద యాసంగి సీజన్‌పై నమ్మకం పెంచింది. జూన్, జూలై నెలల్లో అంతంతగా వరద రావడంతో ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు నీటి విడుదలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటల కోసం నాలుగు తడులు అందించేందుకు ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదల ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. గత మూడు రోజుల నుంచి వరద ఉధృతి పెరడగంతో ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదులుతున్నారు. కాగా, ఎగువ ప్రాంతాల నుంచి అక్టోబర్ 28 వరకు వరద వచ్చే అవకాశం ఉంది. దీంతో యాసంగి సీజన్ ప్రారంభమయ్యే వరకు ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉండే అవకాశం ఉంది. రెండో పంటకు సైతం భరోసా కలగడంపై ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

75.73 టీఎంసీల వరద

ప్రస్తుత సంవత్సరం జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్ట్‌లోకి 75.73 టీఎంసీల వరద నీరు చేరింది. జూన్‌లో 4.48 టీఎంసీలు, జూలైలో 24.49 టీఎంసీలు, ఆగస్టులో (ఇప్పటి వరకు) 46.76 టీఎంసీల వరద వచ్చింది. ఇప్పటి వరకు ఆవిరి రూపంతోపాటు కాలువల ద్వారా, తాగునీటి అవసరాలకు 10.44 టీఎంసీల నీటి విడుదల చేపట్టారు.

అతి తక్కువ ఫీజుతో వైద్యం అందిస్తాం

- సీఎంసీని ప్రారంభించేందుకు సీఎస్‌ఐతో ఒప్పందం
- వివిధ దశల్లో రూ.200 కోట్ల పెట్టుబడి
- అజ్జ శ్రీనివాస్‌ను డైరెక్టర్ పదవి నుంచి తొలగించాం
- సీఎంసీ ఛైర్మన్ షణ్ముఖ మహాలింగం



మీడియాతో మాట్లాడుతున్న షణ్ముఖ మహాలింగం

నిజామాబాద్‌నాగారం: అనుభవజ్ఞులు, వైద్య నిపుణుల బృందంతో ఇంటిగ్రేటెడ్ మెడికల్ సైన్సెస్ – రీసెర్చ్(ఐఎంఎస్‌ఆర్) ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించిన తాము.. క్రిస్టియన్ మెడికల్ కళాశాల, ఆస్పత్రిని ప్రారంభించేందుకు సీఎస్‌ఐతో ఒప్పందం చేసుకున్నామని చైర్మన్ షణ్ముఖ మహాలింగం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐఎంఎస్‌ఆర్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లిలోని సీఎంసీని పునఃప్రారంభించేందుకు వివిధ దశల్లో రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు 2024లో ముందుకు వచ్చామన్నారు. 500 పడకల సీఎంసీ ఆస్పత్రిని మే 25వ తేదీన రాష్ట్ర అధికారుల ఆమోదంతో ప్రజల కోసం తిరిగి ప్రారంభించామని తెలిపారు. డాక్టర్ అజ్జ శ్రీనివాస్ అనే వ్యక్తి తనను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్ అధ్యక్షుడిగా పరిచయం చేసుకుని వచ్చాడని, తనకు 200 మంది వైద్యుల నెట్ వర్క్ ఉందని చెప్పి 30 మందిని నియమించాడన్నారు. డాక్టర్లు అజ్జ శ్రీనివాస్, మంత్రి సుమంత్, ఎల్.పాండు, సుమన్‌కుమార్, సుర్దానీ ఇష్టరాజ్యాంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య పరికరాల కోసం ఐఎంఎస్‌ఆర్ రూ.92 లక్షలు (చెక్కు)ఇవ్వగా.. కొంత పాత పరికరాలను కొనుగోలు చేశారని తెలిపారు. ఇంకా రూ.72లక్షల విలువైన సామగ్రి అందివ్వలేదని తెలిపారు. ఆ తరువాత అజ్జ శ్రీనివాస్‌ను జూన్ 10వ తేదీన తొలగించామని, హైపవర్ కమిటీ చివరకు అజ్జ శ్రీనివాస్ సర్టిఫికెట్లపై కూడా అనుమానాలు వ్యక్తం చేసిందన్నారు. త్వరలోనే ప్రభుత్వ అనుమతులతో సీఎంసీని ప్రారంభించి ప్రజలకు అతి తక్కువ ఫీజులతో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని అన్నారు.

యూరియా పక్కదారి పట్టించే వారిపై ఉక్కుపాదం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ట్రెయినీ కలెక్టర్ మావి, తదితరులు

- వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు
- వీసీలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, సీఎస్

సుభాష్‌నగర్: యూరియాను పక్కదారి పట్టించే వారిపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. సచివాలయం నుంచి వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్, సంచాలకులు గోపి తదితరులతో కలిసి వారు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. యూరియా నిల్వలు, పంపిణీ తీరుతెన్నులను సమీక్షించి కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఇతర శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు నియమించి యూరియా దుర్వినియోగం కాకుండా నిఘా ఉంచాలని మంత్రి తుమ్మల సూచించారు. గతేడాదితో పోలిస్తే ఈ సీజన్‌లో ఇదే సమయానికి లక్ష మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కువగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రావాల్సి ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న ఎరువులను, ప్రత్యేకించి యూరియా నిల్వలు సజావుగా పంపిణీ చేసేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. సహకార సంఘాలు, ప్రైవేట్ డీలర్ల వారీగా ఉన్న యూరియా నిల్వలను నిరంతరం పరిశీలించి, అవసరమున్న ప్రాంతాలకు సర్దుబాటు చేయాలని సూచించారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించకుండా తనిఖీలు చేయాలని మంత్రి ఆదేశించారు. పొరుగు రాష్ట్రాలకు తరలకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసు శాఖ క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.

సరిహద్దులు దాటొద్దు

జిల్లాలో ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచామని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి స్పష్టంచేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సీపీ సాయి చైతన్యతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఒక్క బస్తా కూడా జిల్లా సరిహద్దులు దాటకుండా గట్టి నిఘా సారించాలన్నారు. ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డీఏవో జె గోవిందు, డీసీవో శ్రీనివాస్, ఇండస్ట్రీస్ జిల్లా జనరల్ మేనేజర్ సురేశ్ కుమార్, డీఎంవో గంగుబాయి, ఆర్టీవో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీ ఎస్ఈగా బాధ్యతల స్వీకరణ



బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయం సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా జగదీశ్ సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మొన్నటి వరకు శ్రీనివాస్ గుప్తా ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగారు. కాగా, ఇద్దరు ఎస్ఈలను టీఎన్జీవోస్ నాయకులు, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, డిప్యూటీ ఈఈలు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



బాల్కొండ: వరద పెరిగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఈఈ చక్రపాణి సిబ్బందికి సూచించారు. ప్రాజెక్టుపై సోమవారం సిబ్బందితో వారు మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు నీటమట్టంపై దృష్టి సారించాలని, గేట్ల ఆపరేటింగ్ సరిగా చేపట్టాలన్నారు. వారి వెంట ప్రాజెక్ట్ ఏఈఈలు తదితరులు ఉన్నారు.

మోటార్ మరిచారు..



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను గోదావరిలోకి విడుదల చేసేందుకు నిర్మించిన 42 వరద గేట్లలో 40 వరద గేట్‌కు మోటార్ బిగించడాన్ని సంబంధిత అధికారులు మరిచిపోయారు. సోమవారం వరద గేట్లను ఎత్తినప్పటికీ మోటార్ లేకపోవడంతో 40వ గేటును ఎత్తలేదు. గత మూడు రోజులుగా వరదలు వచ్చి ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతోందని తెలిసినా అధికారులు మోటార్ గురించి పట్టించుకోలేదు. చాలా రోజుల పాటు మరమ్మతులకు నోచుకోక వరద గేట్లు మొరాయించారు. ప్రస్తుతం మరమ్మతులు చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పని చేయడం లేదు.

సాకు చూపి.. మాట మార్చి

ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన రైతు మాదాం చిన్న నర్సయ్య యాసంగి సీజన్‌లో ఒక కంపెనీ కోసం సీడ్ రకం వరి సాగు చేశాడు. ఒక్కో క్వింటాలుకు రూ.2,420 ధరతోపాటు అదనంగా రూ.500 చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు ముందుగా ఒప్పందం కుదుర్చుకున్నారు. 150 క్వింటాళ్ల ధాన్యానికి రూ.3.63లక్షలు మాత్రమే చెల్లించారు. అదనంగా చెల్లించాల్సిన రూ.75వేలను ఇంకా ఖాతాలో జమ చేయడం లేదు. ఎందుకని ప్రశ్నిస్తే ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ చెల్లించలేదు కదా అందుకే డబ్బులు వేయలేదని కంపెనీ ప్రతినిధులు మాట మార్చారు.



మోర్తాడ్‌కు చెందిన రైతు ఏనుగు రాజేశ్వర్‌కు సంబంధించిన 145 క్వింటాళ్ల ధాన్యానికి రూ.500ల చొప్పున. రూ.72,500లను సీడ్ కంపెనీ యాజమాన్యం జమ చేయాల్సి ఉంది.

- సీడ్ రకం పండించిన రైతులకు తగ్గిన ఆదాయం
- సర్కారు బోనస్ ఇవ్వలేదంటూ అదనపు డబ్బులు చెల్లించని వ్యాపారులు



సాగు చేసిన సీడ్ వరి ధాన్యాన్ని రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన రైతులు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ప్రభుత్వం యాసంగిలో కొనుగోలు చేసిన సన్నరకాలకు బోనస్ ఇవ్వలేదనే సాకును చూపుతున్న సీడ్ కంపెనీలు కూడా అదనంగా చెల్లిస్తామన్న సొమ్ము విషయంలో మాట తప్పుతున్నాయి. ప్రభుత్వం బోనస్ ఇస్తేనే తాము కూడా అదనపు సొమ్మును చెల్లిస్తామని లేకుంటే ఇవ్వబోమని కంపెనీలు స్పష్టం చేస్తుండటంతో సీడ్ రకం వరి సాగు చేసిన రైతులకు లాభం తగ్గింది.

సీడ్ కంపెనీల కోసం ప్రత్యేక శ్రద్ధ

సాధారణ రకాలను సాగు చేసే రైతులు సీడ్ కంపెనీల కోసం వరి సాగు చేస్తే మాత్రం ఎక్కువ శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. విత్తనం కొనుగోలుకు ఎక్కువ ధర చెల్లించడమే కాకుండా సీడ్ ధాన్యం ఎండబెట్టడంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే ధాన్యంలో తేమ శాతం 12 ఉంటేనే సరిపోతుంది. సీడ్ కంపెనీలకు మాత్రం 18శాతం తేమ తక్కువ ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. బెరుకులు లేకుండా ధాన్యంను జల్లెడ పట్టి సంచుల్లో నింపుతారు. సీడ్ రకానికి, సాధారణ రకం వరి ధాన్యం సాగు చేసేందుకు తేడా ఉన్నా కంపెనీలు మాత్రం ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడాన్ని సాకుగా చూపుతూ అదనపు సొమ్ము చెల్లించకుండా మొండికేయడంపై రైతులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వమే మాట తప్పింది



సన్నరకాలకు బోనస్ ఇవ్వడంలో ప్రభుత్వమే మాట తప్పింది. లేకపోతే సీడ్ కంపెనీలపై ఒత్తిడి పెంచే వారిమి. ప్రభుత్వం చెల్లిస్తేనే తాము అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 చెల్లిస్తామని మొదట్లోనే సీడ్ కంపెనీలు చెప్పాయి. – తక్కూరి సాగర్, రైతు, మోర్తాడ్

నష్టపరచడం తగదు



కష్టాలకు ఓర్చి పంటలను సాగు చేస్తున్నాం. బోనస్ విషయంలో సీడ్ కంపెనీలు కూడా మాట మార్చడం సరి కాదు. రైతులను రెండువర్గాలు నష్టపరిస్తే ఎవరికి తమ బాధ చెప్పుకోవాలి. ప్రభుత్వం ఆలోచన చేసి బోనస్ చెల్లించాలి. – దడివె మోహన్, రైతు, మోర్తాడ్

ఏ వాహనానికి ఏ నెంబర్ ప్లేట్

మీకు తెలుసా?



ప్రతి వాహనానికి నెంబర్ ప్లేట్ ఉంటుంది. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాన్ని తిప్పుతూ పోలీసులకు పట్టుబడితే జరిమానా వేస్తారు. వాహనాలకు వివిధ రంగుల్లో నెంబర్ ప్లేట్లు కనిపిస్తాయి. అసలు ఏ రంగు నెంబర్ ప్లేట్ ఏ వాహనాలకు కేటాయిస్తారో తెలుసుకుందాం.

తెలుపు రంగు: ఈ నంబర్ ప్లేట్ వ్యక్తిగత వాహనాలకు ఇస్తారు. ఈ ప్లేటు కలిగిన వాహనాలను కమర్షియల్‌గా ఉపయోగించరాదు.

పసుపు రంగు : ట్యాక్సీలు, ఆటోలు వంటి ప్రయాణికులను తరలించే వాహనాలకు ఈ నంబర్ ప్లేట్‌ను వాడతారు.

ఆకుపచ్చ : ఎలక్ట్రిక్ వాహనాలకు ఈ రంగు ఉన్న నంబరు ప్లేట్లను ఏర్పాటు చేస్తారు.

ఎరుపు : ఈ రంగు నంబర్ ప్లేట్లు రాష్ట్రపతి, గవర్నర్ వాహనాలకు మాత్రమే కనిపిస్తాయి. మధ్యలో జాతీయచిహ్నం ఉంటుంది.

నలుపు : విలాసవంతమైన హోటళ్లలకు చెందిన వారి వాహనాలకు ఉపయోగిస్తారు.

నీలం రంగు : విదేశీ దౌత్యవేత్తలు ఉపయోగించే వాహనాలకు ఈ రంగు నంబర్ ప్లేట్‌లు ఉంటాయి.

బాణం గుర్తు : ఈ నెంబర్ ప్లేట్‌లు సైనిక అవసరాలకు ఉపయోగిస్తారు. ఇవి రక్షణ శాఖకు రిజిస్ట్రేషన్ అయి ఉంటాయి. ఈ నంబర్ ప్లేట్‌లలో ఫస్ట్ లేదా రెండో అక్షరం తర్వాత బాణం గుర్తు ఉంటుంది. బాణం గుర్తు అనంతరం వచ్చే సంఖ్య వాహనం కొనుగోలు చేసిన సంవత్సరాన్ని గుర్తు చేస్తుంది. తర్వాత బేస్ కోడ్, సీరియల్ నంబరు, చివరిది వెహికల్ క్లాస్‌ను వివరిస్తుంది.

భారతదేశం సిరీస్ : నెంబర్ ప్లేట్‌పై బీహెచ్ అని ఉంటే ఆ వాహనం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించినదిగా గుర్తించవచ్చు. నాలుగు అంతకంటే ఎక్కువ రాష్ట్రాల్లో తమ సీఎంసీలో ఉన్న కార్పొరేట్ ఉద్యోగులు ఈ నెంబర్ ప్లేట్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

నంబర్ ప్లేట్ లేకుంటే : వాహనానికి నెంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణిస్తే వారిపై సెక్షన్ 171 కింద ఆర్టీఏ, ట్రాఫిక్, పోలీసులు చర్యలు తీసుకుంటారు. మొదటిసారి పట్టుబడితే రూ.200, రెండోసారికి రూ.500 జరిమానా విధిస్తారు. మూడోసారి చిక్కితే వాహనాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది. – ఖలీల్‌వాడి

మానవత్వం చాటారు



వృద్ధురాలు శకుంతలతో మాట్లాడుతున్న సీఐ నరహరి



వృద్ధురాలికి తినిపిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ

- 'సాక్షి' కథనానికి స్పందించిన ఏఎస్పీ చైతన్యరెడ్డి
- 'అనాథగా అమ్మ' వివరాలు సేకరించాలని సీఐకి ఆదేశం
- ఆస్పత్రికి తరలించి వైద్యమందేలా చేసిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ షెడ్డులో కొన్ని రోజులుగా వర్షంలో తడుస్తూ, చలికి వణుకుతూ ఉంటున్న వృద్ధురాలి దీన స్థితిపై 'సాక్షి' దినపత్రిక మెయిన్‌పేజీలో సోమవారం 'అనాథగా అమ్మ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో కథనాన్ని చదివి ఏఎస్పీ చైతన్యారెడ్డి చలించిపోయారు. ఆ వృద్ధురాలికి అన్ని విధాలుగా సహాయం చేసి, పూర్తి వివరాలు సేకరించాలని పట్టణ సీఐ నరహరిని ఆదేశించారు. దీంతో సీఐ నరహరి సోమవారం ఉదయం వృద్ధురాలు శకుంతల ఉన్న చోటికి వెళ్లి వివరాలను సేకరించి ఏఎస్పీకి తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సైతం సాక్షి కథనానికి స్పందించి మానవత్వం చాటారు. వృద్ధురాలి వద్దకు వెళ్లి స్వయంగా భోజనం తినిపించారు. దుస్తులు ధరింపజేసి, దుప్పటి అందజేశారు. పోలీసులతో కలిసి ఆటోలో వృద్ధురాలిని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. వృద్ధురాలి దీనస్థితిపై కథనం రాసిన 'సాక్షి'కి ఏఎస్పీ, పట్టణ సీఐ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌తోపాటు పలువురు అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

- మూట్ కోర్టులో న్యాయవాది రామాగౌడ్



మూట్ కోర్టులో న్యాయమూర్తిగా వ్యవహరించిన రామాగౌడ్, పాల్గొన్న అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): మారుతున్న కాలంలో న్యాయ విద్యార్థులు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ న్యాయవాది రామాగౌడ్ సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో సోమవారం నిర్వహించిన మూట్ కోర్ట్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన రామాగౌడ్ న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సైబర్ నేరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రిమినల్ కేసులలో నిందితుల హక్కులు, చట్టంలో వారికి సంబంధించిన నిబంధనలను వివరించారు.

అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొందరు, నిందితుల తరఫున కొందరు న్యాయ విద్యార్థులు వాద ప్రతివాదనలు వినిపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, హెచ్‌వోడీ కే ప్రసన్న రాణి, బీవోఎస్ చైర్మన్ బీ స్రవంతి, అధ్యాపకులు ఎం.నాగజ్యోతి, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

- వినాయక మండప నిర్వాహకులకు సీపీ సూచన

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్‌లోని ప్రజలు వినాయక చవితి ఉత్సవాలను నిర్విఘ్నంగా జరుపుకోవడంలో ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు పోలీసులకు సహకరించాలని సీపీ పోతరాజు సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేశ్ మండపాలకు సెక్యూరిటీ ఇవ్వడానికి, పాయింట్ బుక్ ఏర్పాటు కోసం సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో గణపతిని ప్రతిష్ఠించేవారు http://policeportal.tspolice.gov.in/index.html వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు. మండపాల వద్ద 24గంటలపాటు నిర్వాహకులు అందుబాటులో ఉండాలని తెలిపారు.

సోలార్ ప్లేట్ల ఏర్పాటుకు నివేదికలు సమర్పించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్: ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల భవనాలపై సోలార్ విద్యుత్ ప్లేట్ల ఏర్పాటుకు మంగళవారం సాయంత్రంలోపు ఆయా శాఖల వారీగా నివేదికలు రూపొందించి సమర్పించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు విషయమై అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు, గురుకులాల భవనాలతో పాటు నీటి పారుదల, మిషన్ భగీరథ శాఖలకు చెందిన ఖాళీ స్థలాల్లో సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అందులో భాగంగా ఆయా శాఖల అధికారులు సౌర విద్యుత్ పలకల ఏర్పాటుకు వీలున్న ప్రభుత్వ కార్యాలయాల భవనాల పూర్తి వివరాలను నిర్దేశిత నమూనాలో పొందుపరుస్తూ, మంగళవారం సాయంత్రంలోపు సమర్పించాలని సూచించారు. సౌర విద్యుత్ పలకల ఏర్పాటుకు కావలసిన వైశాల్యం, విద్యుత్ కనెక్షన్ తదితర వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల పెంపకంపై ప్రత్యేక దృష్టి

సుభాష్‌నగర్: మత్స్య కార్మిక కుటుంబాల ఉపాధిని మెరుగుపర్చి, వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు నాణ్యమైన చేపపిల్లల పెంపకంపై దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో మత్స్యశాఖ పనితీరుపై ఆయన సమీక్షించారు. మత్స్య అభివృద్ధి పథకం కింద 2024–25 సంవత్సరానికి వంద శాతం సబ్సిడీపై 799 చెరువులు, రిజర్వాయర్లలో కోటీ 92 లక్షల చేపపిల్లలను విడుదల చేశామన్నారు. ఈ ఏడాది 967 చెరువుల్లో 4.5 కోట్ల చేపపిల్లలను వదలాలని నిర్దేశించిన నేపథ్యంలో నాణ్యమైన చేపపిల్లల పెంపకానికి చొరవ చూపాలన్నారు. కట్ల, రాహు, బంగారు తీగ రకాల చేప పిల్లలను పెంచుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 398 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలోని 24,071 కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా తోడ్పాటును అందించాలని సూచించారు. మత్స్య కార్మిక సంఘాల సభ్యులు అందరూ ఎస్ఎఫ్‌డీపీ పథకం కింద ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. డిచ్‌పల్లి, అర్సపల్లి ప్రాంతాల్లో నూతనంగా మంజూరైన చేపల మార్కెట్ సముదాయాల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టి, పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి



నస్రుల్లాబాద్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన ఘటన దుర్కి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం .. బాన్సువాడ మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన గుడిసె రాజు(28) సోమవారం ఉదయం నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలోని మాంధారి చెరువు అలుగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. భారీ వర్షాల ధాటికి అలుగు 765డీ మీదుగా పారుతోంది. జాతీయ రహదారి పనుల్లో భాగంగా అలుగు కోసం మొరం కింద నుంచి పైపులు వేశారు. వరద ఉధృతికి మొరం కొట్టుకుపోయింది. రహదారి ఎగువ భాగాన దిగిన రాజు నీట మునిగిపోయాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో తోడుగా వచ్చిన వ్యక్తి కుటుంబీకులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్తులు గజ ఈతగాళ్లతో గాలించగా పైపులైన్‌లో మృతదేహం లభించింది. కాగా, రహదారి పనులు నెమ్మదిగా జరగడంతోనే రాజు మరణించాడని ఆరోపిస్తూ కుటుంబీకులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. మృతుడికి ఓ కూతురు ఉంది.

అదుపు తప్పిన స్కూటీ...



నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్‌రోడ్ వద్ద స్కూటీ అదుపు తప్పి ఓ యువతి సైడ్ డ్రెయిన్‌లో పడిపోయింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సబ్‌స్టేషన్ ఎదుట ఉన్న తాత్కాలిక మట్టిదారి పూర్తిగా కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం డ్రెయిన్ దాటుతుండగా యువతి స్కూటీతో సహా అందులో పడిపోయింది. రోడ్డు పనులు చేస్తున్న కూలీలు గమనించి ఆమె పైన ఉన్న వాహనాన్ని తీసి కాపాడారు.

జాతీయస్థాయి తైక్వాండోకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన క్యూరియస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు మయాంక్ తేజ్, శీతల్ ఎంపికైనట్లు కోచ్ వినోద్ నాయక్ తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 17న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలో మయాంక్ తేజ్, శీతల్ పాల్గొననున్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ డా. రమేశ్ పవార్, ప్రెసిడెంట్ అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి వినోద్ నాయక్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ నెస్ క్లబ్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో క్రీడాకారులు పాల్గొంటారని అధ్యక్షుడు కర్నాటి వాసు, సెక్రెటరీ కేవీ కిరణ్ కుమార్ తెలిపారు.

పోలీసు బందోబస్తు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన నేపథ్యంలో పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మెండోరా ఎస్సై సుహాసిని ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆనకట్ట దిగువనే వాహనాలను నిలిపి వేశారు. గోదావరి వైపు వెళ్లకుండా బారికేడ్లను పెట్టారు. గోదావరి వైపు పర్యాటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బందోబస్తును ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



నస్రుల్లాబాద్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన జల్ల నర్సింలు(52) కామిశెట్టిపల్లిలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకొని జాతీయ రహదారి 765డీ పై సైకిల్ నడుపుతూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు తెలుపగా నర్సింలును బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే నర్సింలు మరణించినట్లు నిర్ధారించారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుంటలో పడి ఒకరు..

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామానికి చెందిన బోడాసు ఎల్లయ్య (50) ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. చెరువులోని పూలను అమ్ముకొని జీవనం సాగించే ఎల్లయ్య ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఫకీరాబాద్ సమీపంలోని కుంటలో ఎల్లయ్య మృతదేహం కనిపించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వర్ని: మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. డీకొండ శ్యామల ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి పరుపు కింద దాచిన రూ.10 వేలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసులో ఆరుగురికి ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: కులం పేరుతో దూషించి, ఇంటిని కూల్చిన కేసులో ఆరుగురికి నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి టీ శ్రీనివాస్ ఐదేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్ మండలం రామన్నపేట్ గ్రామానికి చెందిన పత్రి పోశన్న తన చిన్నమ్మ, చిన్న నాన్నలకు పిల్లలు లేకపోవడంతో వృద్ధాప్యంలో సేవలు చేశాడు. దీంతో వారు తమ తదనంతరం ఇంటిని పోశన్నకు ఇచ్చారు. ఐతే, ఆ ఇంటిపై తనకు హక్కు ఉందని విజయ అనే మహిళ పోశన్న కుటుంబసభ్యులతో గొడవపెట్టుకుంది. రావుట్ల గ్రామానికి చెందిన బాజిరెడ్డి రమాకాంత్, పిప్రి గ్రామానికి చెందిన అరిగెల జనార్దన్, కొంపల్లి మల్లేశ్, భీమ్‌గల్ గ్రామానికి చెందిన గంగాధర్, రాధ, రామన్నపేట్‌కి చెందిన విజయలు 2015 జూన్ 19న పొక్లెయిన్‌తో పోశన్న ఇంటిని కూల్చి వేసి, కులం పేరుతో దూషించారు. దీంతో పోశన్న కుటుంబసభ్యులు మోర్తాడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టుకు పంపారు. కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు రమాకాంత్, జనార్దన్, మల్లేశ్‌లకు రూ.ఐదు వేల జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఎస్సీలైన గంగాధర్, విజయ, రాధలకు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధించారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బంటు వసంత్ వాదించారు.

టాస్క్‌ఫోర్స్ బాధ్యతలు సీసీఎస్‌కు!

ఖలీల్‌వాడి: నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్‌ను సీసీఎస్‌లో కలిపినట్లు పోలీస్‌వర్గాల ద్వారా తెలిసింది. జిల్లాలో పేకాట, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా, మొరం దందాలు, మట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు చేసేది. ఐతే, ఈ విభాగాన్ని సీసీఎస్ చూడనున్నట్లు తెలిసింది. సీఐ, ఎస్సై, ఎనిమిది మంది కానిస్టేబుళ్లు పనిచేసే టాస్క్‌ఫోర్స్‌కు సరైన సమాచారం రావడం లేదనే ఉద్దేశంతో తాత్కాలికంగా తీసివేసినట్లు సమాచారం. గతంలో సీపీగా కల్మేశ్వర్ ఉన్న సమయంలో సిబ్బందిపై ఆరోపణలు రావడంతో వారిపై బదిలీ వేటు వేశారు. కొన్ని నెలలపాటు టాస్క్‌ఫోర్స్ ఎలాంటి కార్యక్రమాలూ చేపట్టలేదు. సీపీగా పోతరాజు సాయిచైతన్య వచ్చిన తర్వాత టాస్క్‌ఫోర్స్‌కు సిబ్బందిని కేటాయించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ మళ్లీ ప్రారంభమైంది. కాగా, టాస్క్‌ఫోర్స్ చేసే పనులను ప్రస్తుతం సీసీఎస్ ద్వారా చేయనున్నట్లు తెలుస్తోంది.

ప్రజావాణికి 52 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 52 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ అంకిత్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ఫిర్యాదుదారులు లేక ప్రజావాణి వెలవెలబోయింది.

ఆర్‌సీవో కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

గురుకులాలకు సంబంధించిన ఆర్‌సీవో కార్యాలయాలను జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజేశ్వర్ మాట్లాడుతూ మూడు జిల్లాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ఆర్‌సీవో కార్యాలయాలు రూరల్ ప్రాంతంలో ఉన్నాయన్నారు. అందరికీ అందుబాటు లో ఉండేలా చూడాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. నాయకులు మనోజ్, సాయికిరణ్, రాకేశ్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన వీసీ, రిజిస్ట్రార్



పీజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల 2, 4వ సెమిస్టర్ పరీక్షలు సోమవారం రెండోరోజు కొనసాగాయి. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట కళాశాల ప్రిన్సిపల్ మామిడాల ప్రవీణ్, కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, అడ్మిషన్స్ డైరెక్టర్ వాసం చంద్రశేఖర్ ఉన్నారు. ఉదయం జరిగిన పీజీ పరీక్షలకు 2,357మంది విద్యార్థులకు గాను 2,228 మంది హాజరుకాగా 129 మంది గైర్హాజరైనట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన బీఈడీ, బీపీఎడ్ పరీక్షలకు 1,487 మంది విద్యార్థులకు గాను 1,418మంది హాజరుకాగా 69 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో ఇందూరు మహిళలు ఫస్ట్

- తృతీయ స్థానంలో నిలిచిన బాలుర జట్టు



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో గెలుచుకున్న ట్రోఫీలతో జిల్లా జట్టు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ మహిళల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 16, 17 తేదీల్లో 5వ తెలంగాణ సీనియర్ బేస్‌బాల్ మహిళల, పురుషుల పోటీలు నిర్వహించారు. మహిళల విభాగంలో నిజామాబాద్, హైదరాబాద్ జట్లు ఫైనల్స్‌లో తలపడాల్సి ఉండగా వర్షం కారణంగా రెండు జట్లను విజేతలుగా ప్రకటించారు. పురుషుల విభాగంలో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బేస్‌బాల్ జనరల్ సెక్రెటరీ శ్వేతా, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ, ఆదిలాబాద్ బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కాలా శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు. టోర్నీలో బెస్ట్ క్యాచర్ అవార్డును సుద్దపల్లిలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఐఎస్‌కు చెందిన లిఖిత అందుకున్నారు. విజేతలను జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్ మధుసూదన్ రెడ్డి, సొప్పరి వినోద్, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హన్మంత్ రెడ్డి, మల్లేశ్ గౌడ్ తదితరులు అభినందించారు.